క్లుప్తంగా

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కామేపల్లి: మండలంలోని పొన్నేకల్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త ఏపూరి సర్వయ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శనివారం పొన్నేకల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం, రూ.5 వేల నగదు అందించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, నాగండ్ల వెంకటేశ్వరరావు, మల్లెల వసంతరావు, వల్లభనేని అశోక్, దండుగల నాగయ్య, గంగారపు భానుప్రతాప్, ఏపూరి రాములు, వెంకటనారాయణ, ఏపూరి సత్యం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు మాజీ ఎమ్మెల్సీ పర్యటన

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ జాతీయ నాయకుడు, మాజీ శాసన మండలి సభ్యుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఖమ్మం జిల్లాలో ఈ నెల 13, 14 తేదీల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలతో పాటు పలు సామాజిక, సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని 11 కేవీ ప్రశాంతినగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–3 ఏఈ జి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో బ్యాంకు కాలనీ, వేణుగోపాల్‌నగర్, రాతోజీనగర్, ఖానాపురం హవేలీ, యూపీఎస్ కాలనీలలో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నేలకొండపల్లి తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు



బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ మానిక్‌రావు

నేలకొండపల్లి: స్థానిక తహసీల్దార్ జె.మానిక్ రావ్‌పై బదిలీ వేటు పడింది. గతేడాది సెప్టెంబర్‌లో ఆదిలాబాద్ జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చిన ఆయన మరలా ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేయాలని కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈనేపథ్యాన శనివారం ఆయనను బదిలీ చేస్తూ కలెక్టర్ కార్యాలయానికి అటాచ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో ధరణి విభాగంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న వి.వెంకటేశ్వర్లును నేలకొండపల్లి తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇస్తూ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఖమ్మంవ్యవసాయం: లో వోల్టేజీ సమస్యను అధిగమించేందుకు నగరంలోని 25వ డివిజన్‌లో సుమారు రూ.10 లక్షల వ్యయంతో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో రిక్కాబజార్, అంబాభవాని గుడి వీధి, పులకలఖండం వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సమస్య తొలగినట్లవుతుంది. విద్యుత్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	గుడ్ బ్యాడ్ అగ్లీ
వినోద	మ్యాడ్ స్క్వేర్
సాయిరాం	జాట్
ఆదిత్య	అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి, రాబిన్‌హుడ్
శ్రీనివాస	జాక్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	4
వంకాయ	26		20
బెండకాయ	26	పాలకూర	4
పచ్చిమిర్చి	48		20
కాకర	46	చుక్కకూర	4
బీట్‌రూట్	24		20
బీర	60	తోటకూర	4
దొండ	18		20
పొట్లకాయ	36	గోంగూర	4
చిక్కుడు	86		20
గోరుచిక్కుడు	46	మెంతికూర	3
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	28		30
చామగడ్డ	44	పుదీన	1
క్యారెట్	36		20
క్యాప్సికం	48	-ఖమ్మం వ్యవసాయం	

బోడులో సాగు భళా..!



మల్లేపల్లిలో సాగు చేసిన బెండ తోట



పరికలబోడుతండాలో సాగు చేసిన చిక్కుడు తోట

సండే స్పెషల్

భరోసానిస్తున్న కూరగాయల సాగు

- బోరు, వర్షపు నీరే ఆధారం
- రైతులకు ఆదరువుగా నిలుస్తున్న వైనం
- ఏటేటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం

రఘునాథపాలెం: వాణిజ్య పంటల సాగు పెట్టుబడి భారంతో పాటు ధర, పంటల దిగుబడి ప్రతి ఏటా లాటరీ సాగుగా మారుతోంది. దీంతో రైతులు ప్రత్యామ్నాయంగా కూరగాయల సాగు వైపు దృష్టి సారించి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. తక్కువ పెట్టుబడి, తక్కువ కష్టంతో పాడి బర్రెల ద్వారా నిత్యం ఆదాయం వచ్చిన మాదిరిగానే కూరగాయాలు పండించిన రైతులకూ అదే మాదిరిగా ఆదాయం వస్తోంది. దీంతో మండలంలో ప్రతీ ఏడు కూరగాయల సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది.

అంతర పంటగా..

జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో బోడు భూముల్లో పండించిన కూరగాయలను నగరానికి తీసుకొచ్చి అమ్మినా లేదా వ్యాపారులే పొలం వద్దకు వెళ్లి కొన్నా.. ఎంతో కొంత ఆదాయం లభిస్తుంటుంది. దీనికి అలవాటుపడిన ఆయా గ్రామస్తులు కూరగాయాల సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. అత్యధికంగా గిరిజన రైతులు ఒక వైపు తమకున్న పొలంలో పత్తి, మిర్చి, తదితర పంటలను సాగు చేస్తూనే దానికి అనుబంధంగా రోజువారి ఆదాయం వచ్చేలా కూరగాయల సాగు చేస్తున్నారు. దీంతో ఇంట్లో ఖర్చులతో పాటు ఇతర పంట పెట్టుబడులకూ అండగా నిలుస్తుందని పలువురు రైతులు చెబుతున్నారు. మండలంలోని కోయచలకకు చెందిన రైతు చెరుకూరి రామారావు వివిధ రకాల కూరగాయలను సేంద్రియ విధానంలో సాగు చేస్తూ రాష్ట్రస్థాయిలోనే మంచి గుర్తింపు పొందుతున్నాడు. కాగా, గ్రామాల్లో ముఖ్యంగా బెండ, గోరు చిక్కుడు, మంచి చిక్కుడు, టమాట, సోర, దోస, వంగ తదితర కూరగాయలు పండిస్తున్నారు. వేసవిలో సైతం బెండ, వంగ, దోస తదితర పంటలు ఆశాజనకంగా ఉండి మంచి దిగుబడులు సాధిస్తున్నారు.

కూరగాయలే ప్రధాన సాగుగా..

మండలంలో సాగు నీటి వనరులు లేకపోయినా వర్షాధారం, లేదా బోర్‌లను నమ్ముకుని రైతులు వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తున్నారు. గతంలో ఒకటి రెండు గ్రామాల్లో ఒకరిద్దరు రైతులు మాత్రమే సాగు చేయగా.. ప్రస్తుతం కూరగాయలనే ప్రధాన సాగుగా పండిస్తున్నారంటే ఏవిధంగా ఆదరువుగా నిలుస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. మండలంలోని సూర్యాతండా, పుటానితండా, ఈర్లపుడి, కేవీబంజర, మంచుకొండ, బూడిదంపాడు, హరియాతండా, పరికలబోడుతండా, మల్లేపల్లి తదితర గ్రామాల్లో అత్యధికంగా పండిస్తుండగా.. కొంతమంది రైతులు మల్చింగ్ ద్వారా కలుపు నివారణతో పాటు నెట్ సాగులో కూరగాయాలు పండిస్తున్నారు.



మల్చింగ్ విధానంలో కూరగాయల సాగు

వాణిజ్య పంటల కంటే మెరుగు..



కూరగాయల సాగు బాగానే ఉంది. పంట దిగుబడులు పెరిగినప్పుడు ధరలు అమాంతం పడిపోయి నష్టం వస్తోంది. ధర ఎప్పుడు ఒకేలా ఉంటే దిగుబడులపై దృష్టి పెట్టి పంటలు పండించుకుంటే కూరగాయల సాగు వాణజ్య పంట కంటే మెరుగ్గా ఉంటుంది.

– బండి గోపి మల్లేపల్లి

మార్కెటింగ్ పెంచాలి..



కూరగాయల సాగులో ఇతర వాణిజ్య పంటల కంటే కష్టం, పెట్టుబడి తక్కువగా ఉంటుంది. పండించిన పంటలకు మార్కెటింగ్ సౌకర్యం పెంచితే బాగుంటుంది. దళారుల వ్యవస్థ కాకుండా మార్కెటింగ్ శాఖ ద్వారా కొంటే సాగు మరింత పెరుగుతుంది.

– బానోత్ కోటేశ్వరి, హరియాతండా

ఆసక్తి పెరిగింది..



రైతులకు కూరగాయలు, ఆకు కూరల సాగులో ఉత్సాహం పెరిగింది. ఆయిల్‌పామ్, మామిడి తోటల్లో అంతర పంటగా సాగు చేస్తున్నారు. బోర్ల ద్వారా డ్రిప్, స్ప్రింకర్ల ద్వారా తక్కువ నీటితో ఎక్కువ ఆయకట్టు కోసం ప్రయత్నం చేస్తున్నారు. నీటి వనరులు మెరుగ్గా ఉంటే అత్యధిక శాతం ఆసక్తి కనబరుస్తారు. – జి.నగేష్, ఉద్యాన అధికారి

వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: వక్ఫ్ సవరణ చట్టం 2025ను తక్షణమే ఉపసంహరించుకోవాలని పలువురు ముస్లిం ధార్మిక పండితులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఖమ్మం చెరువుబజార్‌లోని మదర్సే ఇంద్దాదుల్ ఉలుమ్‌లో సమావేశం నిర్వహించి వక్ఫ్ బిల్లు ఆమోదంపై చర్చించి, బిల్లుకు వ్యతిరేకంగా ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. జమాతే ఇస్లామి హింద్ నాయకులు ముఫ్తీ జలాలుద్దీన్, మౌలానా మహమ్మద్ సయీద్ అహ్మద్ ఖాస్మీ, మొహమ్మద్ ఇలియాస్, మహమ్మద్ సాధిక్, ఐలే హదీస్ నాయకులు అజారుద్దీన్, న్యాయ నిపుణుడు మహమ్మద్ అసద్ మాట్లాడుతూ.. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఈ నెల 14 నుంచి 19 వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఫ్తీ జలాలుద్దీన్, మౌలానా మొహమ్మద్ సయీద్ అహ్మద్ ఖాస్మీ, మహమ్మద్ ఇలియాస్, ముఫ్తీ రౌవుఫ్, మౌలానా ఐనాయతుల్లా, మహమ్మద్ అసద్, ఖమర్, చోటే బాబా, మహమ్మద్ సలాం, జబ్బార్‌లతో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మసీదుల ప్రతినిధులు, ఇన్‌చార్జ్‌లు, వివిధ పార్టీల నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యాన నిరసన..

ఖమ్మంమయూరిసెంటర్: వక్ఫ్ చట్టాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యాన శనివారం నగరంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుకు ఉభయ సభల ఆమోదం ద్వారా బీజేపీ తన మతోన్మాద, మతపరమైన విభజన ఎజెండాను మరింత ముందుకు తెచ్చిందన్నారు. దేశ వ్యాప్తంగా సుమారు తొమ్మిది లక్షల హెక్టార్లలో విస్తరించిన 8.7 లక్షల వక్ఫ్ ఆస్తులపై పెత్తనం కోసమే ఈ చట్టాన్ని తీసుకొచ్చారని, తక్షణమే ఈ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, జానిమియా, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, బీజీ క్లైమెంట్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రజలపై భారాలు మోపుతూ కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న పాలకుల విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేసి పోరాటాలు నిర్వహించాలని శనివారం నగరంలోని నర్సింహాస్వామి గుడి వద్ద 43, 52 డివిజన్ల సీపీఐ శాఖ మహాసభల్లో హేమంతరావు పిలుపునిచ్చారు. కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే పేద ప్రజలకు రక్షణగా ఉంటుందన్నారు. ఈ సభల్లో పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, కార్పొరేటర్ బీజీ క్లైమెంట్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సర్వీస్ విషయాలపై అవగాహన అవసరం

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగ జీవితంలో సర్వీస్ విషయాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రిలు అన్నారు. శనివారం నగరంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్–475జిల్లా శాఖ ఆధ్వర్యంలో లెక్చరర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదన శ్రీనివాస్, లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.శ్రీనివాస్, కె.సురేష్, నాయకులు జి.మల్లయ్య, వినోద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

● కనబడకుండ పోతున్నాయి..

నగరంలో కేఎంసీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లో మంచినీటి కుండలు మాయమవుతున్నాయి. అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ కొరవడడంతో చలివేంద్రాల్లో కుండలను ఎత్తుకెళ్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. చలివేంద్రాలు ఏర్పాటు చేసిన నాటి నుంచి కుండల్లో నీటిని పోయకపోవడంతో కుండలను ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. దీంతో పలు ప్రాంతాల్లో కుండలు లేకుండా ఖాళీ చలివేంద్రాల పందిళ్లు కనిపిస్తున్నాయి. – ఖమ్మంమయూరిసెంటర్



ఖమ్మం ఆర్టీఏ కార్యాలయం వద్ద కుండలు మాయమైన చలివేంద్రం



కొత్త బస్టాండ్ వద్ద కేఎంసీకి వెళ్లే మార్గంలో..


ఘనంగా 'బొమ్మ' వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

ఖమ్మం అర్బన్: బొమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తెలంగాణ జైళ్ల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ సంపత్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థుల నృత్యాలు ఆకటుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ బొమ్మ సత్యప్రసాద్, సెక్రటరీ ఉదారు శ్రీధర్, బాధ్యులు బొమ్మ లక్ష్మీరాజ్యం, మాధవి, అనుష, వివిధ విభాగాల బాధ్యులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో విద్యార్థిని ప్రతిభ



వీక్షను అభినందిస్తున్న కరస్పాండెంట్

ఖమ్మం సహకారనగర్: ఇటీవల హైదరాబాద్‌లో ఎల్ఆర్ఐఎస్ఏ, సీఎస్‌సీ, ఎస్ఎస్ సంస్థల ఆధ్వర్యాన నిర్వహించిన రోలర్ స్కేటింగ్ క్రీడల్లో తమ పాఠశాల విద్యార్థిని పసుపులేటి వీక్ష ప్రతిభ కనబరిచి సిల్వర్, బ్రాంజ్ మెడల్లు సాధించినట్లు స్మార్ట్‌కిడ్జ్ పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, డైరెక్టర్ సుకన్యలు తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థినిని అభినందించాక మాట్లాడారు. ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

'ఎస్‌బీఐటీ'లో ముగిసిన శిక్షణ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో గత 10 రోజులుగా నిర్వహిస్తున్న సీఆర్‌టీ శిక్షణ శనివారం ముగిసిందని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ సాధనలో కమ్యూనికేషన్‌తో పాటు ఆప్టిట్యూడ్ కూడా ముఖ్యమని శిక్షణ అందించినట్లు తెలిపారు. అకడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, జె. రవీంద్రబాబు, ఎన్. శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, శిక్షకులు శివ ప్రవీణ్, నరేష్, దుర్గా ప్రసాద్, రాంబాబు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలి



స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న శ్రీధర్‌రెడ్డి

నేలకొండపల్లి: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి పరుగులు తీస్తుందని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొత్తకొత్తూరు గ్రామంలో శనివారం గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రదర్శన చేశారు. దివ్యాంగులు, ప్రజలను కలిసి వివిధ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. వీధులను శుభ్రం చేశారు. విశ్వకర్మ రుణాలు పొందిన లబ్ధిదారులను ఘనంగా సన్మానించారు. దూగాడ మిషన్ యూనిట్లను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా.. ప్రజల ఆకాంక్షను దారి మళ్లించి పబ్బం గడుపుకుంటున్నారన్నారు. ఫసల్ బీమా పథకాన్ని కేసీఆర్, రేవంత్‌రెడ్డిలు అమలు చేయలేదని అన్నారు. కేంద్రప్రభుత్వం బీజేపేతర ప్రభుత్వాలకు ఎలాంటి వివక్ష చూపడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్, అసెంబ్లీ కన్వీనర్ మేక సంతోష్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, కృష్ణారావు, మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, నాయకులు తొగాటి నాగచారి, సయ్యద్ మోహినుద్దీన్, షేక్ షర్ఫుద్దీన్, ఎలిగేటి గిరి, పురాణం దివాకర్, గెల్లా సాయి, కొండా హర్ష, కందరబోయిన గోపి, తదితరులు పాల్గొన్నారు.

రోటరీనగర్‌లో చలో బస్తీ చలో..

ఖమ్మంఅర్బన్/ఖమ్మంమామిళ్లగూడెం: నగరంలోని 9వ డివిజన్ రోటరీనగర్‌లో చలో బస్తీ చలో కార్యక్రమాన్ని శనివారం బీజేపీ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్ దుకాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి కేంద్ర ప్రభుత్వం ద్వారా కొనసాగుతున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కంపసాటి అంజన్న, పార్టీ నగర, అర్బన్ అధ్యక్షుడు కుమలి శ్రీనివాసరావు, నాయకులు మేడిపల్లి నీలిమ, ఏలూరి సీతారాములు, హుస్సేన్, రాము తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తు గడువు పొడిగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆవుల అశోక్

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు గడువును మరోమారు పొడిగించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవుల అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నాడు స్థానిక రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శని,ఆది, సోమవారాలు సెలవులు కావడంతో సైట్ మొరాయించటం వల్ల కొద్ది మందికి మాత్రమే అవకాశం దొరుకుతుందన్నారు. రెవెన్యూ అధికారుల సైతం కుల, ఆదాయ సర్టిఫికెట్‌లను త్వరగా అందించేలా చూడాలన్నారు. గడువు పొడిగించకపోతే నిరుద్యోగుల తరపున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ పథకం అమలులో దళారీలు, రాజకీయ పార్టీల నేతలకు అవకాశం లేకుండా పారదర్శకంగా అందించాలని కోరారు. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, శోభ, కె.శ్రీను, నాయకులు భరత్, కొమరయ్య, నరసింహారావు, సత్తా తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ పరామర్శ

ఖమ్మంవన్‌టౌన్: కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి తోటి కోడలు కొల్లు కళావతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి శనివారం వారి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. కళావతి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: ఇటీవల గుండెపోటుతో మరణించిన సీపీఎం జిల్లా నాయకుడు ఎర్రా శ్రీకాంత్ చిత్రపటానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శ్రీనివాసనగర్‌లోని ఆయన నివాసలంలో నివాళులర్పించారు. మంత్రి వెంట రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, సాధు రమేష్‌రెడ్డి, కార్పొరేటర్లు కమర్తపు మురళీ, దొడ్డా నగేష్, గజ్జెల్లి లక్ష్మీవెంకన్న తదితరులున్నారు.

హనుమాన్ విజయయాత్ర

కూసుమంచి: హనుమన్ జయంతి పురస్కరించుకుని శనివారం మండలకేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శివాలయం నుండి బస్టాండ్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ, ప్రదర్శన చేపట్టారు.

సన్నబియ్యంతో భోజనం

తిరుమలాయపాలెం: మండలంలోని తిమ్మక్కపేట గ్రామంలో సన్నబియ్యం లబ్ధిదారురాలు నవిలే నాగరాణి ఇంట్లో అధికారులు, కాంగ్రెస్ నాయకులు శనివారం భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుధీర్, ఆర్ఐ వీరయ్య, సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, నాయకులు పత్తి నాగేశ్వరరావు, సుమన్‌రెడ్డి, పొట్ల కిరణ్, రవికాంత్‌రెడ్డి, నవీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లీనరీని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కృష్ణారావు

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యాన ఈనెల 21న సికింద్రాబాద్‌లో జరిగే ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఫోరం స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కే.వీ.కృష్ణారావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్యలు కోరారు. శనివారం ఖమ్మం అమర వీరుల స్తూపం వద్ద జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. నేడు (ఆదివారం) ఉమ్మడి ఖమ్మం జిల్లా అమరవీరుల స్తూపం వద్దకు 'తెలంగాణ ఉద్యమకారుల చైతన్య యాత్ర'వస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలో భాగంగా 250 గజాల స్థలం, 25వేల పెన్షన్‌తో పాటు ఇల్లు నిర్మాణానికి రూ.10 లక్షలు వెంటనే అమలు చేయాలని కోరారు.

'ఉపాధి' కూలీలకు పని కల్పించాలి



కూలీల ఆన్‌లైన్ హాజరు తీసుకుంటున్న దృశ్యం

నేలకొండపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు సరిపడా పనులు కల్పించాలని ఉపాధి హామీ పథకం కూలీల సంఘం జిల్లా నాయకుడు పాకనాటి గోపిరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని అనంతనగర్‌లో ఉపాధి హామీ పనుల వద్ద శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ కూలీలకు కనీసం వంద రోజులైనా పని కల్పించాలని కోరారు. పనులు ఎంపికలో కొర్రీలు పెట్టకుండా గత రెండు నెలలుగా ఆగిన కూలీల పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కూలీలు పాకనాటి సీతారాంరెడ్డి, చింతమళ్ల యశోద, ఆసం వెంకటరెడ్డి, కర్ల బాలస్వామి, సుశీల, రాయి జయమ్మ, చింతమళ్ల వెంకటరమణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



మృతదేహం వద్ద ఫౌండేషన్ బాధ్యులు

ఖమ్మంవైద్యవిభాగం: ఇటీవల ఏన్కూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాయగూడెం వద్ద సాగర్ కాలువలో మహిళా మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టలేని స్థితిలో లభ్యం కాగా పోలీసులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతదేహం కోసం ఎవ్వరూ రాకపోవడంతో అనాథ మృతదేహంగా భావించి పోలీసులు అన్నం ఫౌండేషన్‌కు సమాచారం ఇవ్వగా వారు శనివారం బల్లేపల్లిలోని వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.